నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 9 అక్టోబర్ 2024 | RANGAREDDY



● పాల్గొననున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి

## ఓట్లేసి గెలిపిస్తే.. ఫార్మా విషం నింపుతావా?

● బాధిత గ్రామాల రైతులకు అండగా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాదయాత్ర
● నేడు పోలేపల్లి నుంచి దుద్యాల వరకు ..

బొంరాస్‌పేట, అక్టోబర్ 8 : దుద్యాల మండలంలో ప్రభుత్వం ఏర్పా టు చేయ తలపెట్టిన ఫార్మా కంపెనీలను వెంటనే రద్దు చేయాలనే ప్రధా న డిమాండ్‌తో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బుధవారం పాదయాత్ర చేపట్టనున్నారు. దుద్యాల మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో ఉదయం 7 గంటలకు పూజలు నిర్వహించి అక్కడి నుంచి పాదయాత్రగా ఫార్మా బాధిత గ్రామాలైన హకీంపేట, పులిచెర్లకుంటతండా, రోటిబండతండా, లగచెర్ల, దుద్యాల వరకు వెళ్లనున్నారు. పాదయాత్రలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొని మద్దతు తెలపనున్నారు. కాగా ఫార్మా కంపెనీలను వ్యతిరేకిస్తూ బాధిత గ్రామాలకు చెందిన రైతులు నెలరోజులుగా హకీంపేట చౌరస్తా లో రిలే దీక్షలు చేస్తుండగా.. వారికి బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, పలు ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. రైతుల పక్షాన పోరాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి పాదయాత్రను సక్సెస్ చేసేందుకు బాధిత గ్రామాల రైతులు, బీఆర్ఎస్ నాయకులు కృషి చేస్తున్నారు.

ఈ ఏడాదిలో పౌరసరఫరాల శాఖ నమోదు చేసిన 6ఏ కేసులు, స్వాధీనం చేసుకున్న బియ్యం...

| నెల | 6ఏ కేసులు | బియ్యం (క్వింటాళ్లు) |
|---|---|---|
| జనవరి | 08 | 345 |
| ఫిబ్రవరి | 08 | 269 |
| మార్చి | 11 | 676 |
| ఏప్రిల్ | 09 | 89 |
| మే | 24 | 1,393 |
| జూన్ | 11 | 153 |
| జూలై | 07 | 213 |



# రేషన్ దందా..

## రంగారెడ్డి జిల్లాలో దళారులకు కాసుల వర్షం

ఆహార భద్రతా కార్డుదారులకు సరఫరా అయ్యే రేషన్ బియ్యం జిల్లాలో దళారులకు కాసుల వర్షం కురిపిస్తున్నది. పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణ, నిఘా కొరవడడంతో అర్ధరాత్రుల్లో ఈ బియ్యం రవాణా యథేచ్ఛగా సాగుతున్నది. ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నది. మిల్లర్లు, రేషన్ డీలర్లు, వ్యాపారులు ఈ అక్రమ దందాకు ఊతమిస్తుండడంతో ప్రతినెలా కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు మొక్కుబడిగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారన్న ఆరోపణలున్నాయి.

● రాష్ట్రాలు దాటుతున్న పీడీఎస్ బియ్యం
● రేషన్ డీలర్లే సూత్రధారులు..మిల్లర్లు, వ్యాపారులతో కుమ్మక్కు
● డీలర్లకు వరంగా మారిన పోర్టబిలిటీ విధానం
● ప్రతి నెలా చేతులు మారుతున్న కోట్ల రూపాయలు
● అక్రమ వ్యాపారాన్ని నిరోధించడంలో పౌరసరఫరాల శాఖ విఫలం
● జిల్లాలో ప్రతినెలా 5.58 లక్షల కార్డులకు 11,562 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ
● అర్ధరాత్రుల్లో గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలకు తరలింపు
● మొక్కుబడిగా 6ఏ కేసుల నమోదు
● ఇందులో 40 శాతం బియ్యం పక్కదారే!

రంగారెడ్డి, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో అర్ధరాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా సాగుతున్నది. దళారులు తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసుకుని మరీ కొనసాగిస్తున్నారు. లబ్ధిదారుల నుంచి డీలర్లే బియ్యం తీసుకుని డబ్బులు చెల్లిస్తున్నారు. కొందరు ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యం కొంటున్నారు. అనంతరం దళారులు స్టాక్ పాయింట్లకు చేర్చి రాత్రి సమయంలో లారీల్లో కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.
శంషాబాద్, రాజేంద్రనగర్, శంకర్‌పల్లి, ఎల్బీనగర్, వనస్థలిపురం, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం తదితర ప్రాంతాల్లో రాజకీయ నాయకుల అండదండలతో స్టాక్ పాయింట్లు నడుస్తున్నట్లు సమాచారం. ఇక్కడి నుంచే స్థానిక మిల్లర్లకు, ఇతర రాష్ట్రాలకు బియ్యాన్ని చేరవేస్తున్నారు. కాగా మిల్లర్లు ఈ బియ్యాన్ని డబుల్ పాలిష్ చేసి సన్న బియ్యంలాగా మార్చి, ఆకర్షణీయంగా ఉండే సంచుల్లో నింపి మార్కెట్లో విక్రయిస్తున్నారు. 25 కేజీల బియ్యం బస్తాను రూ. 1,300 నుంచి రూ.2 వేల వరకు బ్రాండెడ్ ముసుగులో విక్రయిస్తున్నారు. ఈ దందాతో సామాన్యుల జేబులకు చిల్లులు పడుతున్నప్పటికీ పౌరసరఫరాల శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదన్న ఆరోపణలున్నాయి

జిల్లాలో అంత్యోదయ, ఆహార భద్రత, అన్నపూర్ణ ఆహార భద్రతా కార్డులు మొత్తం 5,58,438 వరకు ఉన్నాయి. వీటికి ప్రభుత్వం ప్రతినెలా 11,562.725 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని జిల్లాలోని 932 రేషన్ షాపులకు సరఫరా చేస్తున్నది. అయితే ప్రభుత్వం కేటాయిస్తున్న బియ్యంలో సుమారు 40 శాతం వరకు పక్కదారి పడుతున్నట్లు తెలుస్తున్నది. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతున్నది. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసి సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద మిల్లర్లకు ఇస్తుంది. కేజీ ధాన్యం మర ఆడించి ఇచ్చినందుకు మిల్లర్లకు రూ.3.25, మర ఆడిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకి తరలించేందుకు క్వింటాలుకు రూ. 23-27 వరకు చెల్లిస్తున్నది. ఎఫ్‌సీఐ నుంచి మండలాల్లో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ల వరకు రవాణా చేసేందుకు, హమాలీ చార్జీలకు రూ.153 వరకు ప్రభుత్వం వ్యయం చేస్తున్నది. అంటే సగటున కిలో బియ్యానికి రూ. 39.35పైసల వరకు ఖర్చు పెడుతున్నది. ఇంత వ్యయం చేస్తున్నా..నాణ్యత లేవని..ఇతర వేర్వేరు కారణాలతో సగం మంది కార్డుదారులు వాటిని రేషన్ డీలర్లు, వ్యాపారులకు రూ.12-15కే అమ్మేస్తున్నారు. దళారులు వారి నుంచి సేకరించి ఇతర రాష్ట్రాలకు తరలించి రూ.23 చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ లెక్కన 40 శాతం బియ్యం పక్కదారి పట్టడంతో రూ.వందల కోట్లలో బియ్యం దందా జరుగుతున్నట్లు అర్థమవుతున్నది.

### ప్రతినెలా 40 శాతం బియ్యం పక్కదారి..

### డీలర్లకు వరంగా పోర్టబిలిటీ విధానం..

చౌక ధరల బియ్యం పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం ఈ-కేవైసీని అమలు చేస్తున్నది. అలాగే.. బినామీ డీలర్లకు లాగిన్ సౌకర్యాన్ని సైతం తొలగించింది. అయినా డీలర్లు కొంగొత్తగా మోసాలకు పాల్పడుతున్నారు. రేషన్ బియ్యం పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం ఈ-పాస్ యంత్రాన్ని అమల్లోకి తెచ్చి బయోమెట్రిక్ విధానంలో బియ్యాన్ని కార్డుదారులకు అందిస్తున్నది. అలాగే..ఎక్కడి నుంచి అయినా రేషన్ బియ్యాన్ని తీసుకునేలా కేంద్ర ప్రభుత్వం పోర్టబిలిటీ విధానాన్ని తెచ్చింది. బియ్యాన్ని పంపిణీ చేసినందుకు డీలర్లకు క్వింటాల్‌కు రూ.140 చొప్పున చెల్లిస్తున్నది. ఉద్యోగ, ఉపాధి రీత్యా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు అధికంగా ఉండడంతో జిల్లాలో పోర్టబిలిటీ విధానం సక్సెస్‌ఫుల్‌గా సాగుతున్నది. ఇదే డీలర్లకు వరంలా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ తీసుకునే వారు తక్కువగా ఉండడంతో చాలామంది డీలర్లు పట్టణ ప్రాంతాల్లోని రేషన్ షాపుల్లో అక్కడి ఈ-పాస్ యంత్రాలను తీసుకొచ్చి బియ్యం పంపిణీ చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వం నుంచి కమీషన్ రూపంలో వస్తున్న డబ్బులను అక్రమంగా పొందుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో వనస్థలిపురంలోని ఓ రేషన్ షాపులో ఈ తరహా మోసం ఒక టి వెలుగులోకి రాగా..లోతుగా విచారించాల్సిన అధికారులు మమ అనిపించారు. ఈ-పాస్ యంత్రం మాటున జిల్లాలో రూ. కోట్లలో అక్రమ దందా సాగుతున్నట్లు తెలుస్తున్నది. ఒక దుకాణంలోని బియ్యాన్ని మరో షాపునకు సర్దుబాటు చేస్తూ అక్రమాలను కప్పిపుచ్చుతుండగా..సివిల్ సప్లయ్ అధికారుల నిరంతర పర్యవేక్షణ లేకనే జిల్లాలో నయా దందా అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్నదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



# అంచనాలతోనే సరి..

## కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకరణ ఎప్పుడో..

● 50 ఏండ్ల కిందట ప్రాజెక్టును నిర్మించడంతో దెబ్బ తిన్న కాల్వలు, కొట్టుకుపోయిన తూములు, కూలిపోయిన వంతెనలు
● సమృద్ధిగా నీరున్నా తక్కువ విస్తీర్ణానికే సాగునీరు
● కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు సార్లు అంచనాల మార్పు
● తాజాగా మరోసారి సర్వే చేస్తున్న అధికారులు
● మరమ్మతులు పూర్తైతే 9200 ఎకరాలకు అందనున్న సాగునీరు

1.57 టీఎంసీల సామర్థ్యం గల కోట్‌పల్లి ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా ఆయకట్టు రైతులు పూర్తిస్థాయిలో పంటలను సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొన్నది. ఈ ప్రాజెక్టును 50 ఏండ్ల కిందట నిర్మించడంతో దాని కాల్వలు పూర్తిగా దెబ్బతినగా.. తూములు కొట్టుకుపోయాయి. గత కేసీఆర్ ప్రభుత్వం రైతులకు నష్టం జరగొద్దనే సదుద్దేశంతో ఈ ప్రాజెక్టు ఆధునీకరణకు చర్యలు చేపట్టింది. నిధులు విడుదల చేసే దశలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ అక్కడికే ఆగిపోయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను పట్టించుకోవడంలేదు. అంచనాలకే పరిమితమై రైతులకు అన్యాయం చేస్తున్నది.

వికారాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు అయిన కోట్‌పల్లిలో సమృద్ధిగా నీరున్నా రైతులు తమ పంట పొలాల సాగుకు వినియోగించుకోలేని దుస్థితి నెలకొన్నది. గత మూడు, నాలుగేండ్లుగా వర్షాలు సమృద్ధిగా కురవడంతో కోట్‌పల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు మెండుగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టును 50 ఏండ్ల కిందట నిర్మించడంతో దాని కాల్వలు పూర్తిగా దెబ్బతినడం, తూములు కొట్టుకుపోవడం, బ్రిడ్జిలు కూలిపోవడంతో సమృద్ధిగా నీరున్నా ఆయకట్టుకు పూర్తిగా సాగు నీరందని పరిస్థితి నెలకొన్నది. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వం చివరి బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టును ఆధునీకరించాలని సంకల్పించగా.. అధికారులు అవసరమైన నిధుల కోసం అంచనాలు పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేశారు. నిధుల మంజూరు దశలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ అక్కడికే ఆగిపోయింది. తదనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకరణ అంశమే లేకపోవడం గమనార్హం. ప్రజల ఒత్తిడితో అంచనాలను రూపొందించి సర్కారుకు పంపించామని స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నా ఇప్పటివరకు నిధులు మాత్రం మంజూరే కాలేదు. అంతేకాకుండా ప్రతిసారీ అంచనాలను మార్చి పంపించాలని తిప్పి పంపిస్తుండడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు ఇప్పటికే నాలుగుసార్లు అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి అందజేసినా.. నిధుల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. తాజాగా మరోసారి అంచనాలను మార్చి పంపాలని ఆదేశించడంతో జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు మరమ్మతు పనులకు సంబంధించిన సర్వేలో బిజీగా ఉన్నారు. జిల్లా రైతులకు సాగునీరు అందించే ఉద్దేశం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేకపోవడంతోనే నిధుల విడుదలలో జాప్యం చేస్తున్నదని పలువురు మండిపడుతున్నారు.

### సాగు నీరివ్వడం కష్టమే అంటున్న అధికారులు

కోట్‌పల్లి ప్రాజెక్టు ద్వారా తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లోని 18 గ్రామాలకు సాగునీరు అందించాల్సి ఉండగా.. కాల్వలు పూర్తిగా దెబ్బతినడం, తూములు కొట్టుకుపోవడంతో కేవలం 2-3 గ్రామాలకు మాత్రమే కొన్నేండ్లుగా సాగునీరందుతున్నది. అయితే ఈ ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా రుద్రారం, గట్టేపల్లి గ్రామాలకు.. కుడి కాల్వ ద్వారా ఒక్క గ్రామానికి కూడా సాగు నీరందడంలేదు. తూములు, కాల్వలు పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో ఈ యాసంగిలో సాగు నీరం దడం కష్టమేనని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు.

### ఈ ప్రాజెక్టు సామర్థ్యం 9,200 ఎకరాలు..

ఈ ప్రాజెక్టు ద్వారా 9,200 ఎకరాలకు (కుడి కాల్వ ద్వారా 8,100 ఎకరాలు, ఎడమ, బేబీ కాల్వ ద్వారా 1100 ఎకరాలకు) సాగు నీరందించే సామర్థ్యం ఉన్నది. ఈ ప్రాజెక్టు ఆధునీకరణ పనులు పూర్తైతే 15 వేల ఎకరాలకుపైగా సాగు నీరందించే అవకాశాలున్నట్లు జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు కుడి కాల్వ కింద ధారూరు మండలంలోని నాగసముందర్, అల్లాపూర్, రుద్రా రం, బూర్గుగడ్డ, గట్టేపల్లి గ్రామాలుండగా, ఎడమ కాల్వ కింద పెద్దేముల్ మండలంలోని మాన్‌సాన్‌పల్లి, బుద్ధారం, పెద్దేముల్, మారేపల్లి, దుగ్గాపూర్, రుక్మాపూర్, కొండాపూర్, ఖానాపూర్, రేగొండి, మదవంతాపూర్, జనగాం, మంబాపూర్, తింసాన్‌పల్లి గ్రామాలున్నాయి. బేబీ కాల్వ కింద నాగసముందర్, బూర్గుగడ్డ గ్రామాల ఆయకట్టుకు సాగునీరందించేలా నిర్మించారు.

### ప్రాజెక్టు మరమ్మతులకు బీఆర్ఎస్ ప్రత్యేక చొరవ

1.57 టీఎంసీల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా కాల్వలు కొట్టుకుపోవడం, దెబ్బతినడంతో రైతులకు నష్టం జరగొద్దనే ఉద్దేశంతో తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కోట్‌పల్లి ప్రాజెక్టును ఆధునీకరించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన కేసీఆర్ వెంటనే జలవనరుల అధికారుల బృందాన్ని అక్కడికి పంపించి.. ఏయే పనులు చేపట్టాలో సమగ్ర నివేదికను అందజేయాలని సూచించారు.
అధికారుల సూ చనల మేరకు కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.110 కోట్లతో ప్రాజెక్టు ఆధునీకరణతోపాటు ఆనకట్ట బలోపేతం, కుడి, ఎడమ, బేబీ కాల్వల పునర్నిర్మాణం, పాత వంతెనల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు అంచనాలను తయారు చేశారు. అయితే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో నిధులు విడుదలకు బ్రేక్ పడింది. తదనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నది. మరోవైపు తాండూరు, వికారాబాద్ ఎమ్మెల్యేలు ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు తీసు కు రావడం లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

# పేదల ఇండ్లకు నష్టం కలిగించొద్దు

● మూసీ బాధిత ప్రజల హక్కుల కోసం ఐక్యంగా పోరాడుతాం
● రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు

చిక్కడపల్లి, అక్టోబర్ 8 : పేదల ఇండ్లకు నష్టం లేకుండా మూసీ ప్రక్షాళన చేపట్టాలని వామపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయబ్ హాలులో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్, నగర నాయకుడు మహేందర్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నగర కార్యదర్శి వరలక్ష్మి, సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకురాలు ఝాన్సీ, సీపీఐ(ఎంఎల్)మాల్‌లైన్ రాష్ట్ర నాయకురాలు ఎస్.ఎల్.పద్మ, సీపీఐ(ఎం-ఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకురాలు అనురాధ, ఎంసీపీఐ(యూ)రాష్ట్ర నాయకుడు అనిల్‌కుమార్, పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు సంధ్య, మానవ హక్కుల నేత సయ్యద్ బిలాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన జరగాలని, దానికి అవసరమైన చర్యలు చేపట్టాలి అంతే కానీ.. ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో వేలాది మంది పేదలు, మధ్యతరగతి ప్రజల ఇండ్లను తొలగించాలనుకోవడం సమంజసం కాదన్నారు.
టూరిజం అభివృద్ధి కోసం, కార్పొరేట్ కంపెనీల వ్యాపారాల కోసం పేదల ఇండ్లను తొలగించాలనుకోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్‌తో సహా ఎలాంటి ప్రతిపాదనలు లేకుండానే ఇండ్ల తొలగింపునకు పూనుకోవడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. మూసీ ప్రాజెక్టులో ప్రభుత్వం చేపట్టదలచిన అభివృద్ధిపై చర్చలు జరిపిన తర్వాతే ప్రజల ఆమోదంతో ముందుకెళ్లాలని సూచించారు. మూసీనది పరిసరాల్లో నివసిస్తున్న వేలాది మంది పేదలను అభివృద్ధిలో భాగస్వాములు చేయకుండా, వాళ్ల ఉపాధిని పట్టించుకోకుండా ఏకపక్షంగా నగరం అవతలకు తరలించే చర్యలు మానుకోవాలన్నారు. మూసీ నిర్వాసిత ప్రజలతో వారి నివాస హక్కుల కోసం, ప్రభుత్వ బెదిరింపు చర్యలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాడుతాయని వారు ప్రకటించారు.

## విద్యుత్తు శాఖలో బదిలీలపై సందిగ్ధం!

### గడువు ముగిసినా ప్రకటించని జాబితా

సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు శాఖలో బదిలీలపై సందిగ్ధత నెలకొన్నది. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియకు సోమవారంతో గడువు ముగిసిన వెంటనే జాబితా ప్రకటించాల్సిన డిస్కం ఉన్నతాధికారులు మంగళవారం సాయంత్రం వరకూ దాన్ని ప్రకటించలేదు. దక్షిణ తెలంగాణ విద్యుత్తు సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ బదిలీల్లో పారదర్శకత కోసం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి మార్గదర్శకాలను రూపొందించారు. బదిలీలకు అర్హులైన ఉద్యోగుల జాబితాను హోదాల వారీగా విడుదల చేసి, వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ ఎక్కడ కావాలో ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. ఈ బదిలీ ప్రక్రియ సాఫీగా, వేగంగా ముగుస్తుందని భావించారు. సాఫ్ట్‌వేర్‌లో వెబ్‌కౌన్సెలింగ్ గడువు 7వ తేదీ అర్ధరాత్రి వరకు ముగిసినా, మరుసటి రోజైన మంగళవారం బదిలీలకు సంబంధిత జాబితాను వెంటనే ప్రకటించాల్సి ఉంది. దీనికి కారణం పెద్దల నుంచి ఒత్తిళ్లేనని తెలుస్తున్నది. సుమారు 850 మందిని బదిలీ చేయాలని నిర్ణయించగా, అందులో 25 నుంచి 30 పోస్టులకు పైరవీలు జరిగినట్లు చర్చ నడుస్తున్నది. దక్షిణ డిస్కం పరిధిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 10 సర్కిళ్లలోనే పోస్టింగ్‌ల కోసం ఉద్యోగులు ఎక్కువ ఆసక్తిని కనబర్చారు. వెబ్ కౌన్సెలింగ్ విధానమున్నా.. సచివాలయం నుంచి ఆదేశాలు తెచ్చుకునేందుకు కొంతమంది ప్రయత్నిస్తూనే ఉండడంతోనే ఉద్యోగుల బదిలీల జాబితాను ప్రకటించలేకపోతున్నారని సమాచారం. మరోవైపు డిస్కంలోని హెచ్ఆర్ విభాగం అధికారులు మింట్ కాంపౌండ్‌లోని ప్రధాన కార్యాలయంలో కాకుండా ఎర్రగడ్డ-జీటీఎస్ కాలనీలో ఉన్న విద్యుత్తు శాఖకు చెందిన కార్యాలయంలో బదిలీల తుది జాబితాపై కసరత్తు చేసినట్లు సమాచారం. మొత్తంగా విద్యుత్తు శాఖలో బదిలీల ప్రక్రియ ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో చెప్పలేమని పలువురు ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు.




కలెక్టరేట్ల ఆవరణలో ఉద్యోగినులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక, ప్రతీక్ జైన్

# కలెక్టరేట్లలో బతుకమ్మ సందడి

● ఉద్యోగినులతో కలిసి బతుకమ్మ ఆడిన కలెక్టర్లు శశాంక, ప్రతీక్ జైన్

రంగారెడ్డి, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ)/వికారాబాద్ : ప్రకృతిలో లభించే పూలతో దేవతను చేసి పూజించే వేడుక బతుకమ్మ పండుగ అని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో డీఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని.. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీతలతో కలిసి గౌరమ్మకు పూజలు చేసి..ఉద్యోగినులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకమని, సేకరించిన పూలతో అందంగా బతుకమ్మను పేర్చి పూజిస్తారన్నారు. తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ పండుగ రాష్ట్రం, దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి శ్రీలత, సీపీవో సౌమ్య, పద్మజారమణ, పీడీ మెప్మా, రెవెన్యూ సిబ్బంది, ఇతర శాఖల ఉద్యోగినులు పాల్గొన్నారు.

### ప్రకృతికే అందం మన బతుకమ్మ..

వికారాబాద్ : ప్రకృతికే అందం మన బతుకమ్మ సంబురమని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో డీఆర్‌డీఏ, డీడబ్ల్యూవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై గౌరీమాతకు పూజలు చేసి మాట్లాడారు. బతుకమ్మ పండుగను కలెక్టరేట్‌లో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అన్ని శాఖల ఉద్యోగినులు స్వయంగా బతుకమ్మలను పూలతో పేర్చి బతుకమ్మ ఆడి పాడి సందడి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్డీవో శ్రీనివాసులు, డ్వాక్రా మహిళలు, అధికారులు పాల్గొన్నారు.